**వీక్ డేస్**
**మీ డైలీ మేనిఫెస్టో**

# బర్గర్లు, కాలుష్య కారకాలతో గుండెపోటు

## అందుబాటులోకి వచ్చిన శస్త్ర చికిత్సఅవసరంలేని 'యాక్ట్'

సమస్తం కాలుష్యమయం. ఎంత జాగ్రత్త తీసుకున్నా ప్రయోజనం అంతంత మాత్రమే. కాలుష్య భూతం కోరలు చాచి కబళిస్తోంది. గతంలో పెద్ద వారికి మాత్రమే అరుదుగా గుండె పోటు వచ్చేది. ఇప్పుడలా కాదు. వయసు తారతమ్యం లేదు. ఎంతో మంది గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. హైదరాబాద్‌లోనూ ఇప్పుడు అత్యధిక సంఖ్యలో గుండె సంబంధిత బాధితులు ఉన్నారు. ఇటీవల కాలంలో మరింతగా పెరిగిపోయారు. దీనంతటికీ కారణం



**కొవ్వు పదార్థాలు తినడం, సిగరెట్లు తాగడం మాత్రమే కాదు, పిజా బర్గర్ సంస్కృతి పెరిగిపోవడం, కాలుష్య మయం కావడమేనని డాక్టర్ ప్రవీణ్ కుమార్ సక్సేనా అంటున్నారు.**

ఆపరేషన్ అవసరం లేకుండానే గుండె పోటును నివారించే 'యాక్ట్' చికిత్సను ఈయన అందుబాటులోకి తెచ్చారు. కాలిఫోర్నియా నుంచి దిగుమతి చేసుకుని వందల మందికి చికిత్స అందిస్తున్నారు. విశేషమేమిటంటే... అవుట్ పేషెంట్లుగా ట్రీట్‌మెంట్. వారానికో సారి మూడు గంటల పాటు. ధమనుల్లో పేరుకుపోయిన కొవ్వును బట్టి సిటింగ్స్ ఆధారపడి ఉంటాయని డాక్టర్ ప్రవీణ్ అంటున్నారు. మామూలుగా సెలైన్ ఎక్కించి నట్లుగానే చేతి నరం ద్వారా డోస్‌ను పంపించి ధమనులలో నిరోధాన్ని తొలగించడమే యాక్ట్ చికిత్స అని ఆయన వివరించారు. శనివారం బషీర్‌బాగ్‌లోని సక్సేనా సెంటర్ ఫర్ ప్రోగ్రెసివ్ మెడిసిన్ దగ్గర చాలామంది జనం ఉన్నారు. ఏమిటా అని ఆరా తీస్తే... కేలేషన్ చికిత్స కోసమని చెప్పారు. నిజంగా ఈ రోజుల్లో గుండెపోటు అంటే దాదాపు రెండు లక్షల ఖర్చు. ఖర్చు తరువాత విషయం ఆపరేషన్ అంటే చాలామందికి భయం. అలాంటిది అసలు శస్త్రచికిత్స లేకుండా కేలేషన్ చికిత్స అంటే ఆశ్చర్యం కలిగింది. పైగా మొత్తం సిటింగ్స్‌ను బట్టి 20 నుంచి 30 వేల రూపాయలేనని అక్కడున్న వారు చెబితే మరింత ఆశ్చర్యం అనిపించింది. అందుకే లోపలకు వెళ్ళి డాక్టర్ సక్సేనాను పలకరించాం. ఆయన మరిన్ని ఆసక్తికరమైన విశేషాలు వెల్లడించారు. ఈ చికిత్స నగరంలోకి నాలుగేళ్ళ క్రితమే ఒక మహిళా డాక్టర్ అందుబాటులోకి తెచ్చారు. ఆమె ప్రస్తుతం శ్రీలంకలో ఉంటున్నారట. ఇప్పుడు డాక్టర్ సక్సేనా సెంటర్‌తో పాటు బంజారాహిల్స్‌లో డాక్టర్ సాధన దగ్గర మాత్రమే ఈ చికిత్స అందుబాటులో ఉందని తెలిసింది.

పేషెంట్స్ రూమ్‌లోకి అడుగుపెడితే అందరూ ట్రీట్‌మెంట్ చేసుకుంటూ హాయిగా టివి చూస్తూ కాలక్షేపం చేస్తున్నారు. ఫలిత మెలా ఉందని ప్రశ్నిస్తే సిటింగ్స్‌ను బట్టి మెరుగవడం ఖాయమని డాక్టర్ ప్రవీణ్ అంటున్నారు. సరే, ఆయనతో మాట్లాడాక నెట్‌లో చూస్తే యాక్ట్ చికిత్స గురించి మరిన్ని వివరాలు తెలిశాయి. ఇది రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఛాతీ నొప్పిని, అధిక రక్తపోటును కూడా తగ్గిస్తుంది. ఈ పద్ధతి ద్వారా జ్ఞాపకశక్తి మెరుగవుతుంది. మానసిక సామర్థ్యం పెరుగుతుంది. దీర్ఘకాలిక అలసట వ్యాధి లక్షణాల నుంచి విముక్తి కలిగిస్తుంది. లైంగిక సామర్థ్యం కూడా పెంచుతుందని, చర్మపు రంగును మెరుగు పరుస్తుందని ఇలా చాలా లాభాలు ఉన్నాయని తెలిసింది.

### ఇది చట్టబద్ధమైనదేనా?

యాక్ట్ చట్టబద్ధమైన ప్రక్రియేనని డాక్టర్ ప్రవీణ్ చెబుతున్నారు. ఇందులో వాడే మందులు ఎఫ్‌డిఎ అనుమతించినవేనని ఆయన అంటున్నారు.

ఇంగ్లండ్‌లోని నేషనల్ హెల్త్ సర్వీసెస్ వారు గుర్తించారని, అమెరికన్ కాలేజ్ ఆఫ్ అడ్వాన్స్‌మెంట్ ఇన్ మెడిసిన్‌చే నిర్దేశింపబడిందని ఆయన చెప్పారు.